సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 14 । జూలై । 2023



రెండు నెలలుగా వేతనాల్లేవ్!
బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మోత్కూరులో పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. - IIIలో



కొనసాగుతున్న సమ్మె
సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. - IIIలో

గరిష్టం/కనిష్టం
33° / 25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

15న గురుకుల కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి : ఆలేరులోని సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందడానికి ఈనెల 15న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీరాం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు నేరుగా కళాశాలలో హాజరు కావాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన అడ్మిషన్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా భువనగిరిలోని గురుకుల కళాశాలలో పరిమిత ఖాళీలను 10వ తరగతిలో 8.5 జీపీఏ పాయింట్ల పైన ఉన్న విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు.

వెల్వర్తి సర్పంచ్‌గా అన్నామేరీ తిరిగి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన అన్నామేరీ

వలిగొండ : మండలంలోని వెల్వర్తి గ్రామ సర్పంచ్‌గా పసల అన్నామేరి శౌరి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అవినీతి ఆరోపణలపై సర్పంచ్ పదవి కోల్పోయిన అన్నామేరి.. హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే ఇవ్వడంతో ఆమెను సర్పంచ్‌గా కొనసాగాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నామేరిని గుండు శేఖర్, ఎడవెల్లి యాదయ్య, నానమాల ఉప్పలయ్య, వెంకటేశం, రామకృష్ణ, స్వామి, శంకరయ్య, పాపయ్య, నరసింహ అభినందించారు.

యాదాద్రి దేవస్థానం అధికారి సస్పెన్షన్

యాదగిరిగుట్ట : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని బీ5 సెక్షన్ సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు పడింది. సూపరింటెండెంట్ హోదాలో ఉన్న సదరు అధికారి తరుచూ విధులకు గైర్హాజరవుతుండడంతో ఆలయ ఈఓ గీతారెడ్డి పలుమార్లు మందలించారు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో సస్పెండ్ చేసినట్లు డీఈఓ భాస్కర్‌శర్మ తెలిపారు. ఆ అధికారి గతంలో కూడా సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరారు.

కొల్లూరు పాఠశాలను సందర్శించిన డీఈఓ



విద్యార్థితో పాఠం చదివిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

ఆలేరురూరల్ : మండలంలోని కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ నారాయణరెడ్డి సందర్శించారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి మంచి మార్కులు రాబట్టాలన్నారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులచే పాఠాలు చదివించారు. అదే విధంగా వంట గదిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు



లింగవారిగూడెంలో పత్తి మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

సంస్థాన్ నారాయణపురం : వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ సూచించారు. సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్, లింగవారిగూడెం గ్రామాల్లో పత్తి చేలను గురువారం ఆమె పరిశీలించారు. వర్షాలు కురువకపోవడంతో చాలా చోట్ల విత్తనాలు మొలకెత్తలేదని, మొలకలు వచ్చిన చోట ఎదుగుదల లేదన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కందులు, జొన్న వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఓ ఉమారాణి, సర్పంచ్ కత్తుల సురేష్, ఏఈఓ రవితేజ, వెంకన్న తదితరులు ఉన్నారు.

పెద్ద చెరువుకు
పర్యాటక కళ



విద్యుత్ లైట్ల వెలుగుల్లో ఆకర్షణీయంగా భువనగిరి పెద్ద చెరువు

మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకున్న చెరువు కట్ట
- ప్రత్యేక ఆకర్షణగా 'లవ్ భువనగిరి'
- ఆహ్లాదం పంచుతున్న పచ్చదనం
- స్ఫూర్తి నింపుతున్న జాతీయ జెండా
- సుందరీకరణకు మరో రూ.8.5 కోట్లు
- భువనగిరి వాసుల్లో ఆనందం

భువనగిరి : పట్టణంలోని పెద్ద చెరువు మరిన్ని అందాలను సంతరించుకోనుంది. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంలో భాగంగా ఇప్పటికే చెరువు కట్ట ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ఆహ్లాదం పంచేలా పచ్చదనం, లవ్ భువనగిరి సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా.. వంద ఫీట్ల ఎత్తయిన జాతీయ జెండా స్ఫూర్తిని నింపుతోంది.ఇందుకోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం.. తాజాగా మరో రూ.8.50 కోట్లు విడుదల చేసింది.

పెరిగిన సందర్శకుల తాకిడి

సుందరీకరణతో పెద్ద చెరువుకు మహర్దశ చేకూరుతోంది. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే పట్టణవాసులతో పాటు ప్రయాణికులను ఆకర్షించవచ్చనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం దశలవారీగా నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటికే చెరువు కట్టను వెడల్పు చేశారు. సందర్శకులు కూర్చోవడానికి బెంచీలు వేశారు. రూ.10లక్షలతో లవ్ భువనగిరి లోగో, రూ.18 లక్షలతో 100 ఫీట్ల ఎత్తున్న జాతీయ పతాకం ఏర్పాటు చేశారు. రూ.90 లక్షలతో కట్టపై 1.25 కిలో మీటర్ల పొడవునా 90 విద్యుత్ దీపాలు వేశారు. దీంతో చెరువు వద్దకు సందర్శకుల తాకిడి పెరిగింది.

చేపట్టనున్న పనులివీ..

పక్షులు, జంతువుల బొమ్మలు, పూలు, పచ్చిక, నీడనిచ్చే మొక్కలు ఏర్పాటు చేయనున్నారు. తదుపరి రానున్న నిధులతో సూర్యాపేట చెరువు తరహాలో భువనగిరి పెద్ద చెరువులో కూడా బోటింగ్ ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదని సమాచారం.

ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం



భువనగిరి పెద్ద చెరువు సుందరీకరణపై ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి దశల వారీగా నిధులు మంజూరు చేయిస్తున్నారు. ఇప్పటికే ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న పెద్ద చెరువును తాజాగా మంజూరైన నిధులతో మరింత అందగా తీర్చిదిద్దుతా. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు.
–ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్, భువనగిరి



ఆటల పరికరాలు



16 నుంచి పనులు ప్రారంభం

భువనగిరి పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏ మరో రూ. 8.50 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.7 కోట్లు సుందరీకరణకు, రూ.1.50 కోట్లు గ్రీనరీ ఏర్పాటుకు ఖర్చు చేయనున్నారు. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ గురువారం పూర్తయ్యింది. ఈనెల 16వ తేదీ నుంచి పనులు ప్రారంభించనున్నారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

బకాయి సీఎంఆర్ పూర్తి చేయండి

- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు, మిల్లర్లు, గోదాముల యజమానులు

సాక్షి యాదాద్రి : బకాయి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం అధికారులు, మిల్లర్లు, గోదాముల యజమానులతో సమావేశమై పెండింగ్ సీఎంఆర్‌పై సమీక్షించారు. 2022 – 23 వానాకాలం, యాసంగికి సంబంధించి ఇప్పటి వరకు 90,219 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించగా ఇంకా 37,635 మెట్రిక్ టన్నులు పెండింగ్ ఉందన్నారు. అన్ని మిల్లులు పూర్తి సామర్థ్యంతో మిల్లింగ్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. తమకు రావాల్సిన బకాయిలను ఎఫ్‌సీఐ అధికారులు జనవరి నుంచి చెల్లించడంలేదని నాగిరెడ్డిపల్లి గోదాం యజమాని శివరాజ్‌గౌడ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ బకాయిలు చెల్లించాలని సూచించారు. అదే విధంగా సీఎంఆర్ రైస్‌ను గోదాములకు తరలిస్తే రోజుల తరబడి అన్‌లోడ్ కావడం లేదని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపునూరి నాగభూషణం కలెక్టర్‌కు తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌సీఐ డీఎం వరుణ్‌సూద్, సివిల్ సప్లై మేనేజర్ గోపికృష్ణ, పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా భువనగిరి ఖిలా

సాక్షి, యాదాద్రి : భువనగిరి కోటను టూరిజం హబ్‌గా తీర్చిదిదేందుకు అవసరమైన చర్యలు తీసు కోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. టూరిజం హబ్‌తో ఉపాధి అవకాశాలు పెరుగుతా యన్నారు. ఖిలా అభివృద్ధికి డీపీఆర్ రూపొందించడానికి అధికారులతో కలెక్టర్ గురువారం సమావేశమయ్యారు. మాస్టర్ ప్లాన్, సౌకర్యాలు, హాస్పిటాలిటీ, పార్క్, రోడ్లు, లైటింగ్ సిస్టం తదితర ఏర్పాట్లపై చర్చించారు. ప్రధానంగా యోగా, మెడిటేషన్ వసతులు ఉండాలని, కోట చుట్టూ అవసరం ఉన్నంత పార్కింగ్ ఉండాలని సూచించారు. రాక్ క్లైంబింగ్ ఇనిస్టిట్యూట్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి నాగిరెడ్డి, జిల్లా టూరిజం అధికారి ధనంజనేయులు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మౌంటినీరు అన్వితారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగినప్పుడే సాధికారత

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సాధికారత సాధ్యమని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం భువనగిరి మండలంలోని బండసోమారంలో 60 మంది మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టుమిషన్లు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం గ్రామంలోని సబ్ స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పంజాల రామాంజనేయులు, సర్పంచ్‌లు నానం పద్మకృష్ణ, ఎలిమినేటి కృష్ణారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, నాయకులు రాహుల్‌గౌడ్, షేక్ మజార్ పాష, దర్గాయి హరిప్రసాద్, వైఎల్‌ఎన్ రెడ్డి, మల్లారెడ్డి, గోద శ్రీనివాస్ పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

నల్లగొండ : రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నియమించారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల పేర్లను గురువారం ప్రకటించారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
దేవరకొండ (ఎస్టీ)	ఆర్డీఓ, దేవరకొండ
నాగార్జునసాగర్	అదనపు కలెక్టర్(రెవెన్యూ), నల్లగొండ
మిర్యాలగూడ	ఆర్డీఓ, మిర్యాలగూడ
హుజూర్‌నగర్	ఆర్డీఓ, హుజూర్‌నగర్
కోదాడ	ఆర్డీఓ, కోదాడ
సూర్యాపేట	ఆర్డీఓ, సూర్యాపేట
నల్లగొండ	ఆర్డీఓ, నల్లగొండ
మునుగోడు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్అండ్ఆర్, ఎల్ఏ, యూనిట్-2 నల్లగొండ
భువనగిరి	ఆర్డీఓ, భువనగిరి
నకిరేకల్(ఎస్సీ)	అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), నల్లగొండ
తుంగతుర్తి(ఎస్సీ)	అదనపు కలెక్టర్(రెవెన్యూ), సూర్యాపేట
ఆలేరు	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), భువనగిరి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వీరే..

దేవరకొండ నియోజకవర్గం : పీఏపల్లి, దేవరకొండ, చింతపల్లి, గుండ్లపల్లి, చందంపేట, నేరడుకొమ్ము, కొండమల్లేపల్లి తహసీల్దార్లు
నాగార్జునసాగర్ : నిడమనూరు, త్రిపురారం, అనుముల, పెద్దవూర, గుర్రంపోడు, తిరుమలగిరి(సాగర్) తహసీల్దార్లు
మిర్యాలగూడ : వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి తహసీల్దార్లు
హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్, నేరేడుచర్ల, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెరువు, పాలకవీడు, చింతలపాలెం తహసీల్దార్లు
కోదాడ : కోదాడ, నడిగూడెం, చిలుకూరు, మోతె, అనంతగిరి, మునగాల తహసీల్దార్లు
సూర్యాపేట : సూర్యాపేట, ఆత్మకూర్.ఎస్, చివ్వెంల, పెన్‌పహాడ్ తహసీల్దార్లు
నల్లగొండ : తిప్పర్తి, నల్లగొండ, కనగల్ తహసీల్దార్లు
మునుగోడు : చౌటుప్పల్, మునుగోడు, నారాయణపూర్, మర్రిగూడ, నాంపల్లి, చండూరు, గట్టుప్పల తహసీల్దార్లు
భువనగిరి : భువనగిరి, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, వలిగొండ తహసీల్దార్లు,
నకిరేకల్ : కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల తహసీల్దార్లు
తుంగతుర్తి : తిరుమలగిరి, తుంగతుర్తి, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, శాలిగౌరారం, మోత్కూర్, అడ్డగూడూరు, మద్దిరాల, నాగారం తహసీల్దార్లు
ఆలేరు నియోజకవర్గం : ఆలేరు, ఆత్మకూరు.ఎం, బొమ్మలరామారం, గుండాల, మోటకొండూర్, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట తహసీల్దార్లు

ఆలేరు మార్కెట్‌ను నంబర్ వన్‌గా నిలపాలి

- నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో నేతల సూచన



ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ జ్యోతిని గజమాలతో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆలేరురూరల్ : ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం గురువారం ఆలేరు పట్టణంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. నూతన చైర్మన్‌గా మోత్కుపల్లి జ్యోతి, వైస్ చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్‌తో పాటు 16మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ హాజరై మాట్లాడారు. నూతన పాలకవర్గం సమన్వయంతో పనిచేసి ఆలేరు మార్కెట్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలని కోరారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, పండించిన పంటకు మద్దతు ధర ఇస్తున్నది ఒక్క బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందంటే అది ముఖ్యమంత్రి కేసీఆర్ కృషివల్లే సాధ్యమైందన్నారు. బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడానికి పార్టీ కార్యకర్తలంతా సమన్వయంతో పని చేయాలని కోరారు. అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆశీర్వదించి అవకాశం కల్పిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని మోత్కుపల్లి తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉండే తాను అనామకునిలా ఇంటికి పరిమితం కాలేనన్నారు. నాకంటూ ప్రత్యేకమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. అంతకుముందు మహిళలు బోనాలు ఎత్తుకొని, కోలాటం ఆడుతూ సభా వేదిక వద్దకు ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

హాజరుకాని శారాజీపేట బీఆర్‌ఎస్ నాయకులు

శారాజీపేటకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిదులు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నామని, తమ గ్రామానికి మార్కెట్ కమిటీలో ఒక్క పదవి కూడా దక్కలేదన్న అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తమ గ్రామం అంటేనే ఎమ్మెల్యే చిన్న చూపు చూస్తున్నారని,నిన్నమొన్న వచ్చిన వారికి అవకాశం కల్పించారని తమ సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలుస్తోంది.

కాంగ్రెస్‌కు కరెంట్ షాక్ తప్పదు

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- భువనగిరిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు

భువనగిరి : ఉచిత విద్యుత్‌కు వ్యతిరేకంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో కరెంట్ షాక్ తప్పదని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ అవసరం లేదన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భువనగిరిలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ధర్నా చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల కష్టం తెలిసిన నేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని, వారి కోసం ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ధాన్యం విక్రయించిన రైతులు నగదు పొందడానికి అనేక ఇబ్బందులు పడేవారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అటువంటి సమస్య లేదని, నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో వ్యవసాయంపై ఆ పార్టీ విధానం ఏమిటో తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఏనాడూ రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీకి రైతులే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్లు పడమటి మమత నరేందర్‌రెడ్డి, మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కె.కవిత, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, పాల్గొన్నారు.

అర్హులు 12,978 మంది

- రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తుల విచారణ పూర్తి
- క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు
- నియోజకవర్గానికి 300 మందికి



మోత్కూర్‌లో దరఖాస్తుదారు ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు

భువనగిరిటౌన్: బీసీ కులవృత్తిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మున్సిపాలిటీల్లో ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగా.. గ్రామాల్లో బుధవారం పూర్తికానుంది.

క్షేత్రస్థాయికి వెళ్లి..

మండలాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. దరఖాస్తుదారుల వయస్సు, గతంలో బీసీ కార్పొరేషన్ రుణం తీసుకున్నారా లేదా, ఆర్థిక స్థోమత, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా, దరఖాస్తుదారులు స్థానికంగా ఉంటున్నారా లేదా వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. సేకరించిన వివరాలను జిల్లా కమిటీకి నివేదించనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనుంది. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను మండల, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఆర్థికసాయం అందిస్తారని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తులు, అర్హులు ఇలా..

లక్ష రూపాయల ఆర్థికసాయం కోసం జిల్లా వ్యాప్తంగా 17 మండలాలు, 6 మున్సిపాలిటీల్లో మొత్తం 14,959 దరఖాస్తులు వచ్చాయి. జూన్ 30 నుంచి దరఖాస్తుల పరిశీలన మొదలైంది. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు సేకరించారు. ఇందులో అర్హులు 12,978 అనర్హులు 1,259 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇంకా 722 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వే పూర్తి కావడంతో మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు రెండు రోజుల్లో నివేదికను ఆన్‌లైన్ చేసి హార్డ్ కాపీలను జిల్లా బీసీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించనున్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన బీసీలోని 15 కులాల వారే కాకుండా ఇతర కులాలు వారు కూడా దరఖాస్తు చేసుకోవడంతె సాటే ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 722 అప్లికేషన్లు పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

మొదలైన పైరవీలు!

లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం దరఖాస్తుదారులు పైరవీలు ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రతి నెలా 15న సాయం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఒకేసారి సాయం అందిస్తారా, విడతల వారీగా ఇస్తారా తెలియాల్సి ఉంది.

విచారణ పూర్తయింది

లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించేందుకు క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే పూర్తయ్యింది. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాం. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేశాం. అర్హుల జాబితాలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ఆన్‌లైన్ చేసి హార్డ్ కాపీలు బీసీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేస్తారు.
–యాదయ్య, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

నార్నే రియల్ ఎస్టేట్ భూములపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న జహంగీర్

బీబీనగర్: మండల కేంద్రంలోని నార్నే రియల్ ఎస్టేట్ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్నే వెంచర్లల్లో ఎన్నో అవకతవకలు ఉన్నాయని ప్రభుత్వ చొరవ చూపి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు నర్సింహ, శ్రీనివాస్, సత్యనారాయణ, ఉమర్, జంగయ్య పాల్గొన్నారు.

విపత్తుల నుంచి రక్షణ పొందడంపై అవగాహన

భువనగిరిటౌన్ : విపత్తులు సంబవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డీఆర్ఎఫ్ పదవ బెటాలియన్ విజయవాడ టీం కమాండర్ ముఖేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా సంక్షేమ అధికారి సిబ్బంది, సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు యాదయ్య, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

తుర్కపల్లి: మండలం కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గా ఆర్‌ఎస్ వక్త బండి రాజుల శంకర్ గురు విశిష్టత, సంస్కృతి సాంప్రదాయలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో నల్లగొండ విభాగ్ సామాజిక సమరసత సహ ప్రముఖ కూరెళ్ళ సందీప్‌చారి, సహధర్మ జాగరణ ప్రముఖ సుధాకర్, మహేందర్, జగదీస్, శ్రీనివాస్, కొక్కొండ లక్ష్మీనారాయణ, ఆకుల రమేశ్, శత్రునాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

రామన్నపేట : ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం అన్నారు. గురువారం రామన్నపేట బాలికల సాంఘిక సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు బెడ్‌షీట్లు, కార్పెట్లు, నోటు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో వసతిగృహ అధికారి రాజాలుబాయి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

భువనగిరి : మండలంలోని చీమలకొండూర్ గ్రామానికి చెందిన బీస అయిలమ్మ(65) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. చందుపట్ల పీఏసీఎస్ డివిడెండ్ నిధి నుంచి ఆ సంఘం చైర్మన్ ఎలిమినేటి మల్లారెడ్డి రూ. 30 వేల ఆర్థికసాయాన్ని మృతురాలి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పల్లెర్ల స్వామి, అంగడి బాలమ్మ, సిబ్బంది సీఈవో దంతూరి నర్సింహ, గుర్రం నాగరాజు, గజరాజు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన మున్సిపల్ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తంగెళ్లపల్లి నందకిషోర్‌కు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పంపిన రూ.50 వేల ఆర్థికసాయాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి అందజేశారు. వారి వెంట దాసరి ప్రవీణ్, ఎండీ అయాజ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని ఖైతాపురం గ్రామానికి చెందిన తగరం స్వప్న భర్త నరహరికి గురువారం రాజీవ్‌స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 15వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎంఏ.ఖయ్యూం, సైదులుగౌడ్, గోపి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవం

భువనగిరి : రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని ఓ హోటల్ నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పడమటి జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పలుగుల ఆగేశ్వర్‌రావు, కోశాధికారిగా వేమూరి అశోక్ కుమార్‌గౌడ్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ చెన్న లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, గడ్డం జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, బాలయ్య యాదవ్, బండారు శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో సర్పంచ్ భర్త

ఆత్మకూరు(ఎం): గత వారం రోజులుగా గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో మండలంలోని కప్రాయపల్లి సర్పంచ్ సామ వరలక్ష్మి భర్త సామ శ్రీనువాసరెడ్డి గురువారం పంచాయతీ ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో చెత్తను సేకరించారు.


పంచాయతీ ట్రాక్టర్ నడుపుతున్న సర్పంచ్‌భర్త శ్రీనివాస్ రెడ్డి

రెండు నెలలుగా వేతనాల్లేవ్!

- పారిశుద్ధ్య కార్మికుల అవస్థలు
- మూడు మున్సిపాలిటీల్లో పెండింగ్
- మోత్కూరులో విధులు బహిష్కరించిన కార్మికులు

మోత్కూరు : పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. అసలే అరకొర వేతనాలు, అవి కూడా సకాలంలో అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణ కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో మోత్కూరు మున్సిపాలిటీలో కార్మికులు గురువారం విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో 3 గంటల పాటు బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.


మోత్కూరులో రాస్తారోకో చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆర్థికంగా ఇబ్బందులు

పారిశుద్ధ్య కార్మికుల్లో అందరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. కొందరు వితంతువులు కూడా ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే వేతనం తప్పా.. ఇతర ఆదాయమార్గాలు లేవు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్మికులు విధులు బహిష్కరించడంతో ఎక్కడికక్కడ చెత్తకుప్పలే దర్శనమిచ్చాయి.

కార్మికులు, చెల్లించాల్సిన వేతనాలు ఇలా..

- మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో 67 మంది పారిశుద్ధ్య కార్మికులు ఔట్ సోర్సింగ్ విధానంపై పని చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా సుమారు రూ.11లక్షలు ఎస్‌టీఓ ద్వారా కార్మికుల వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. మే, జూన్ నెలల వేతనాలు ఇప్పటి వరకు అందలేదు.
- భువనగిరి లో 228 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 210 మంది ఔట్ సోర్సింగ్, 18 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జనరల్ ఫండ్ నుంచి ప్రతి నెలా 1వ తేదీన చెల్లిస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఇప్పటి వరకు వేతనం అందలేదు.
- భూదాన్‌పోచంపల్లిలో 38 మంది కార్మికులు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరికి వేతనంగా ప్రతి నెలా రూ.6.86లక్షలు జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు. ఒక నెల వేతనం పెండింగ్‌లో ఉంది. ప్రగతి నిధుల నుంచి ఎస్‌టీఓకు పంపించారు.

ఎట్ల బతకాలి



“ రెండు నెలలు వేతనాలు రావల్సి ఉంది. సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుంది. అధికార్లు, ప్రజాప్రతినిధులకు చెప్పినా స్పందిస్తలేరు. సకాలంలో వేతనాలు ఇవ్వాలి.

–యాదయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, మోత్కూరు

అప్పులు చేయాల్సి వస్తుంది



“ రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. నిత్యావసర వస్తువులు, పిల్లల చదువుల కోసం, ఇతర అవసరాలకు అప్పులు తెచ్చుకోక తప్పడం లేదు. ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి.

–కొమ్ము లక్ష్మి, పారిశుద్ధ్య కార్మికురాలు, మోత్కూరు

ఎస్టీఓలో పెండింగ్‌లో ఉన్నాయి



“ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ఎస్టీఓలో పెండింగ్‌లో ఉన్నాయి. మే, జూన్ నెలలకు వేతనాల బిల్లులు చేసి పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే నేరుగా కార్మికుల ఖాతాల్లో జమఅవుతాయి.

–శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి : చేనేత వస్త్రాల స్టాక్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో చేనేత టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత సంఘాలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చేనేత వస్త్రాల నిల్వలు పేరుకుపోయి చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. ఫలితంగా చేనేత కార్మికులకు పనికల్పించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి భారత లవకుమార్, కోశాధికారి భోగ విష్ణు, చేనేత చీరెల ఉత్పత్తిదారులసంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, కర్నాటి నర్సింహ, నర్సింహ, బాలరాజు, సీత లక్ష్మణ్, గుండు ఉప్పలయ్య, చంద్రశేఖర్, ఆడెపు ఆంజనేయులు, చంద్రయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తకాలు అందజేస్తున్న దాతలు

మోత్కూరు : పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ అన్నారు. పఠనోత్సవాల్లో భాగంగా గురువారం పుస్తకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయానికి 100 పుస్తకాలను స్థానిక శాఖ గ్రంథాలయం నుంచి సేకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మత్స్యగిరి, మనోహరాచారి, దుర్గాప్రసాద్, అంజయ్య, వెంకటయ్య, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటాచారి, అచ్చిరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట రూరల్: ఈ నెల 18, 19 వ తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, గణేష్, వెంకటయ్య, లక్ష్మయ్య, శంకర్, అమరేందర్, సురేష్, కిష్టయ్య, రజనీకాంత్, పోచయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బీబీనగర్: మండలంలోని పెద్దపలుగు, బొడ్క , చిన్నపలుగు తండాల్లో కొనసాగుతున్న అండర్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ బిచ్యా నాయక్, ఉప సర్పంచ్ దస్రు, రమేష్, దేవేందర్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం


మోత్కూరు : రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు : ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, బి.కళ్యాణ్‌చక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, బుషిపాక లక్ష్మి, బి.వెంకటయ్య, రచ్చ లక్ష్మినర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కుమారస్వామి, సుజాత, సుల్తానా, మజీద్, గనగాని నర్సింహ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అయోధ్య, మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ , పీఏసీఎస్ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు , సత్యం గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కొప్పుల మోహన్‌రెడ్డి, నాయకులు విద్యాసాగర్, పరమేష్, నరేందర్ పాల్గొన్నారు.

రామన్నపేట : ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, పోచబోయిన మల్లేశం, పీఏసీఎస్, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్లు నంద్యాల భిక్షంరెడ్డి, బొక్క మాధవరెడ్డి, వెంకటేశం, కూనూరు ముత్తయ్య, ఇనాయతుల్లాబేగ్, క్రిష్ణ, సర్పంచ్‌లు గుత్తా నర్సిరెడ్డి, అప్పం లక్ష్మీనర్సు, యాదయ్య, ముత్యాల సుజాత, రేఖ యాదయ్య, ఎంపీటీసీలు వేమవరపు సుధీర్‌బాబు, ఎండీ ఆమేర్, రమేష్, రాములు, రమేష్, బలరాం, రమేష్, సాయి, దామోదర్‌రెడ్డి, ఎడ్ల సురేందర్, సతీష్, జంగిలి నర్సింహ, పున్న వెంకటేశం పాల్గొన్నారు.

సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి


గుండాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం) : తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని సాధించాలనే లక్ష్యంతో తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా కార్యదర్శి దొడ్డి రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ముత్యం అశోక్, దర్శనం వెంకన్న, కరుణాకర్, సత్యనారాయణ, సోమయ్య, పాండురంగం, శ్రవణ్‌కుమార్, సునీత, హరిత, ఇందిరప్రియ, ఉదయశ్రీ పాల్గొన్నారు.

గుండాల : పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐతరాజు గిరివర్ధన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెర్సిగ్రేసి, రామకృష్ణ, హరిత, జగన్, రవి, మహేష్, భాగ్యలక్ష్మి, సతీష్, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎల్‌ఓసీ అందజేత

వలిగొండ : మండలంలోని వెల్వర్తికి చెందిన కల్కురి సాయికుమార్ , నాగారం గ్రామానికి చెందిన అంజలికి మంజూరైన ఎల్‌ఓసీ చెక్కులను గురువారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తుమ్మల వెంకటరెడ్డి , మొగుల్ల శ్రీనివాస్, కలుకూరి రాములు, లింగస్వామి, మాద శంకర్, నాగిళ్లయాదగిరి, భిక్షపతి ,సలీం పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బొమ్మలరామారం : నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమాకు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఏఈఓలకు అందజేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు(ఎం): మండలంలోని కామునిగూడెం బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దొమ్మేటి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తుర్కపల్లి: మండలంలోని మోతీరాంతండా గ్రామ పంచాయతీ పరిధిలో గల కొత్తబావి తండాకు చెందిన బానోత్ లక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును గురువారం ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, జెడ్పీవైస్ చైర్మన్ బీకునాయక్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, బానోత్ భాస్కర్‌నాయక్, బాలునాయక్, పాండునాయక్, పాల వెంకటేశం తదితరులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరాధ్య ఫౌండేషన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదు

మోత్కూరు : ఆరాధ్య ఫౌండేషన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ తెలిపారు. గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆరాధ్య ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గంలో ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయడం, దివ్యాంగులకు, వృద్ధులకు సేవ చేయడం కోసం మాత్రమే ఫౌండేషన్ స్థాపించడం జరిగిందన్నారు. ఆరాధ్య ఫౌండేషన్ మండల కమిటీల ప్రమేయం లేకుండా చైర్మన్ వాణిశ్రీకాంత్ రాజ్ ఫోటోలను, ఫౌండేషన్ లోగోలను పోస్టర్లలో, బ్యానర్లలో వాడుకోవద్దన్నారు.

లక్ష్మయ్యకు నివాళి

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పట్టణ నాయకుడు గుర్రాల శ్రీనివాస్ తండ్రి గుర్రాల లక్ష్మయ్య మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గురువారం లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కూర వెంకటేశం, కె.సోమయ్య, బీసుకుంట్ల సత్యనారాయణ, పిట్టల బాలరాజు పాల్గొన్నారు.

పంట రుణాలు మాఫీ చేయాలని వినతి

మోత్కూరు : పంట రుణాలు మాఫీ చేయాలని కోరుతూ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మోత్కూరు తహసీల్దార్ షేక్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పానుగల్ల రమేష్, పిట్టల చంద్రయ్య, తాటి రాములు, శివయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు(ఎం): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ ఎం. జయమ్మ, ఆర్ఐ చిప్పలపెల్లి యాదగిరి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్ సౌకర్యం, మంచినీటి వసతి, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. మండలంలో 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బీసీ ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

వలిగొండ : ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీ ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీసీల ఆధ్వర్యంలో ప్లీనరీ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వరికుప్పల మధు, దిలీప్ కుమార్ , నానచర్ల రమేష్,ఆజామ్ , పెంటయ్య, గంజి మహేష్, ఆరీఫ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


యాదగిరిగుట్ట రూరల్ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టి సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

యాదగిరిగుట్ట రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 8వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో రామనర్సయ్య, బాలరాజు, నర్సింహులు, సోకం సత్తయ్య, శ్రీనివాస్, స్వామిదాసు, నవీన్, స్వప్న, నర్సింహ, జగత్, సత్యనారాయణ, మొగులయ్య, క్రిష్ణ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

ఆత్మకూరు(ఎం): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె గురువారం ఎనిమిదవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో కూరెల్ల కిష్టయ్య, పెండెం సత్యపాల్, నోముల స్వామి, చెన్నూరి నర్సింహ, ప్రశాంత్, రమేష్, ఫక్కీరయ్య, సుధాకర్, నర్సయ్య, శ్రీను, పద్మ, హేమలత పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి

బొమ్మలరామారం : పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని ర్యాకల శ్రీశైలం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు గురువారం ఆయన తన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిద్దెంకి యాదగిరి, లక్ష్మీకాంతం, బాలయ్య, అండమ్మ, బాలమణి, మైసయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండాల : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. కార్యక్రమంలో పరశురాములు సురేష్, యాదగిరి, శ్రీనివాస్, మల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలి

అడ్డగూడూరు : గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

వలిగొండ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. సమ్మెభాగంగా పంచాయతీ కార్మికులు వంట వార్పు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెబోయిన వెంకటేశం, కొండే నర్సింహ, ఎలమయ్య, మధు , రాజు, కలింగాస్వామి, శ్రీనివాస్, స్వామి, రాములు, కౌసల్య, మట్టిపెల్లి లింగస్వామి , అంజయ్య పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. సమ్మెకు బీజేపీ రాష్ట్ర నాయకుడు సుధగాని హరిశంకర్ గౌడ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లేష్, క్రిష్ణ, రవీందర్, ఆంజనేయులు, స్వామి, నరేష్, రమేష్, స్వామి పాల్గొన్నారు.

రామన్నపేట : గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. సమ్మెకు ప్రజానాట్య మండలి కళాకారులు సంఘీభావం తెలిపి ఆటా పాటా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లెల పెంటయ్య , వెంకటేశం, కందుల హన్మంత్, శివకుమార్, దేశపాక రవి, సురేష్, శ్రీ కృష్ణ, సంపత్, లింగస్వామి, మధు, గణేష్ రాము, శ్రీనివాసచారి, సాలయ్య పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 8వ రోజుకు చేరింది. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, చాంద్‌పాష, గంగయ్య, నర్సింహ, మల్లేష్, లింగస్వామి, రాణి, ఇంద్రమ్మ, జయమ్మ, శ్రీశైలం పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

సంస్థాన్ నారాయణపురం: గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ : గ్రామపంచాయితీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. పంచాయతీ కార్మికులు ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందీశ్వర్, పాష, శ్రీనివాస్‌రెడ్డి, పాపయ్య, నర్సింహ, భిక్షపతి, రాజు, శంకర్, శివాజీ, భాస్కర్, విజయ్, శ్రీశైలం, దశరథ, సాయికుమార్, ధనుంజయ, మారమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించడం సిగ్గుచేటు


ఆలేరురూరల్ : కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోటకొండూర్ : పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడం సిగ్గు చేటని పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుగ్గ శ్రీను, శ్రీశైలం, జహంగీర్, సంతోష్ రెడ్డి, నవీన్ రెడ్డి, లవన కుమార్, శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, పలుఉవరు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

ఆలేరురూరల్ : ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడాన్ని నిరసిస్తూ మండలంలోని మందనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు నోముల వెంకటేష్, ఊట్కూరి సురేష్, అంజయ్య, పాలసంఘం చైర్మన్ వెంకటేష్, యాదగిరి, చంద్రయ్య, సురేష్, శ్రీశైలం, మహేష్, సిద్దులు, సాయికుమార్, ప్రవీణ్, ఉపేందర్, కార్తీక్, లోకేష్, మధు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరిటౌన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహించ తలపెట్టిన ధర్నాకు బయలు దేరి వెళ్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, సామల శోభన్ బాబు, ముంతాజ్ బేగం, వసంత, అనసూర్య, నాయకులు సంధ్య, లక్ష్మి, సామల పద్మ, నిర్మల, అరుణ, పుష్ప, సునీత, ఫర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చౌటుప్పల్ : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన ఆకారపు ప్రశాంత్ కుటుంబాన్ని గురువారం బీజేపీ జిల్లా నాయకుడు అర్థ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మందుల శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, మహేష్, అరిగె రాజు, లింగారెడ్డి, కాసోజు వెంకటాచారి, మోటె మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్, మెస్ చార్జీలు ఇవ్వాలి

భువనగిరిటౌన్ : హాస్టల్ విద్యార్థులకు నోటు బుక్స్, పెంచిన మెస్ చార్జీలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు అందించాలని, విద్యార్థులకు మెస్ చార్జీలు వెంటనే ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేసే విధంగా జీఓ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, నెలిగొండ సాయి, నెలిగొండ వినయ్, దొనకొండ కోటేష్, కల్కూరి సాయిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీతక్కకు క్షమాపణలు చెప్పాలి

మోత్కూరు : ఎమ్మెల్యే సీతక్కకు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పల్రెపాటి యుగేందర్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఓ టీవీ డిబెట్‌లో సీతక్కపై చేయిచూపిండాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో అవిశెట్టి అవిలుమల్లు, మందుల సురేష్, కారుపోతుల శ్రీను, రాచకొండ బాలరాజు, శేఖరాచారి, ఉయ్యాల అంజయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య, అంతటి వెంకటయ్య, నిమ్మల శ్రీను, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

యూనిటీ ఫార్మసీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్


చీర కట్టుకుని ర్యాంప్ వాక్ చేస్తున్న విద్యార్థిని

భువనగిరి : మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్‌తో పాటు సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఏ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల వంటకాలను రుచి చూశారు. ఉత్తమ వంటకాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సంప్రదాయ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన రాంప్‌వాక్ పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి గోవర్ధన్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సరిత, హెచ్ఓడీ డాక్టర్ రవి కృష్ణ, ఇస్మాయిల్, రాజీవ్, పృధ్వీరాజ్, నాగరాజు, మహేష్, పావని, ప్రియాంక, నందిని, భానుసుదా, ఏవో సునీత, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

తుర్కపల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్ అన్నారు. గురువారం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బింగిమీనాపాండు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్‌నాయక్, బాలునాయక్, పాండునాయక్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలి

చౌటుప్పల్ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు టీఎస్‌ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల, మున్సిపల్, కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, నాయకులు బత్తుల శ్రీహరి, ఏనుగు రవీందర్‌రెడ్డి, రాచకొండ భార్గవ్, ఊదరి నర్సింహ్మా, బీమనపల్లి సైదులు, నాగరాజు, ఊదరి మహేష్, నవీన్, శ్రావణ్, శివ, దిలీప్, శ్రీధర్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బస్‌పాస్‌లను అందజేస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

క్లుప్తంగా

చోరీ చేస్తూ పట్టుబడిన ఇద్దరికి దేహశుద్ధి

ఆలేరురూరల్: కార్యకర్తల జేబులో నుంచి ఇద్దరు దొంగలు డబ్బులు చోరీ చేస్తుండగా వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఆలేరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం మార్కెట్ కమిటీ నూతన ప్రమాణస్వీకారోత్సవానికి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తల జేబులో చేయి పెట్టి ఇద్దరు వ్యక్తులు డబ్బులు చోరీ చేయబోయారు. గమనించిన కార్యకర్తలు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి అక్కడ ఉన్న పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆలేరు ఎస్సై వెంకట శ్రీను తెలిపారు.

న్యాయం చేయాలి..

- వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికుడు

చండూరు: తనకు న్యాయం చేయాలని కోరుతూ చండూరు మున్సిపాలిటీ కార్మికుడు జిట్టగోని నర్సింహ గురువారం రాత్రి స్థానిక సెంటర్‌లో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపాడు. పోలీసులు, బాధితుడి తల్లిదండ్రులు, ఓ ప్రజాప్రతినిధి ఫోన్ ద్వారా అతడికి సర్దిచెప్పడంతో అరగంట తర్వాత ట్యాంకు దిగాడు. ఈసందర్భంగా కార్మికుడు నర్సింహ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం మున్సిపల్ కార్యాలయంలో రూ.2 లక్షలు తీసుకుని పారిశుద్ధ్య కార్మికుడిగా ఓ ప్రజాప్రతినిధి నియమించారని తెలిపాడు. కానీ తన నియామకంపై ఉన్నత అధికారుల ఆమోదం లేదని కార్యాలయం అధికారులు నెలానెలా వేతనం ఇవ్వడం లేదని వాపోయాడు. తన పేరును కార్యాలయంలో ఎందుకు నమోదు చేయడం లేదని అడిగితే.. ఆ ప్రజాప్రతినిధికి చెందిన వారి నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

భువనగిరి: మహిళ మెడలో పుస్తలతాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకునివెళ్లాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం .. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కొండమడుగు శివాని స్థానిక గంజ్‌లో ఓ కిరాణం షాపులో పనిచేస్తుంది. రోజు మాదిరిగా పని ముగించుకుని సుమారు రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో శ్రీరాంనగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే లైన్ దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారం పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువులను రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

చిట్యాల: జాతీయ రహదారి మీదుగా చిట్యాల పట్టణ శివారులో మూడు డీసీఎం వాహనాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 181 పశువులను గురువారం పట్టుకున్నట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు మూడు డీసీఎంలల్లో అక్రమంగా పశువులు రవాణా అవుతుండగా చిట్యాల పట్టణ శివారులోని జాతీయ రహదారిపై రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఈ మూడు వాహనాల్లో 181 పశువులుండగా వాటిలో 101 ఆవులు, 80 ఎద్దులున్నాయి. ఈమేరకు పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న రమావత్ శ్రీను, కేతావత్ బాద్య, ధరావత్ నగేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శిథిలావస్థలో 'మూసీ' అతిథి గృహం

- కూలిపోయే దశలో భవనం పైకప్పు
- మరమ్మతులకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- భవనం లేక సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బంది



శిథిలావస్థకు చేరిన మూసీ అతిథి గృహం



కూలిపోయే దశలో సిబ్బంది క్వార్టర్లు

కేతేపల్లి: నాగార్జునసాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు వద్ద గల అతిథి గృహానికి దశాబ్ద కాలంగా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇక్కడ అతిథి గృహం నిర్మించింది. తొలినాళ్లలో అతిథి గృహ పరిసరాల్లోని పార్కులు, పూలతోటలు, వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారు. ఈ ఆవరణలోనే సిబ్బందికి క్వార్టర్లు సైతం నిర్మించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథి గృహంలోనే విశ్రాంతి తీసుకునేవారు. రానురాను నిధుల కొరత, నిర్వహణ లోపంతో మూసీ అతిథి గృహంతో పాటు, పరిసర ప్రాంతాలు అందాలను కోల్పోయాయి. అతిథి గృహం భవనం పైకప్పు కూలే దశలో ఉంది. 2014లో మూసీ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.18 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, మరమ్మతులను పట్టించుకోలేదు. 2018లో మూసీ కుడి, ఎడమ కాల్వల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.65 కోట్లు మంజూరు చేసినప్పటికీ, వసతి గృహానికి ఒక్క పైసా కేటాయించలేదు. ఇబ్బందులకు గురవుతున్న అధికారులు, సిబ్బంది మూసీ రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల పరిధిలో దాదాపు 35వేల ఎకరాలకు పైగానే సాగు నీరు అందుతుంది. వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో కింది స్థాయి సిబ్బందితో పాటు, ప్రాజెక్టు ఉన్నతాధికారులు సైతం 24 గంటలు డ్యాం వద్దనే మకాం వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్వహణను పర్యవేక్షించే అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులకు రెస్ట్ హౌస్ లేకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ అధికారుల ప్రాజెక్టు నిర్వహణపై మూసీ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందిగా మారింది. డ్యామ్ వద్ద ఉన్న చిన్నపాటి ఇరుకైన గదిలోనే సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆక్రమణకు గురవుతున్న ఆవరణ

అతిథి గృహం ఆవరణ చుట్టూ ప్రహరీ లేక నలువైపులా ఆక్రమణకు గురవుతోంది. ఇనుప వైరుతో వేసిన ఫెన్సింగ్ ఆనవాలు లేకుండా పోయింది. అతిథి గృహం ఆవరణ చుట్టూ వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఏటేటా సాగు చేసుకుంటూ ఆవరణలోకి చొచ్చుకొస్తున్నారు. పశువులు, గొర్రెలు ఆవరణలో తిరుగుతుండటంతో పచ్చదనం కోల్పోయింది. అధికారులు భవనాన్ని పట్టించకోకపోవటంతో మందు బాబులకు నిలయంగా మారింది ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అతిథి గృహం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మూసీ అతిథి గృహ భవన నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రెస్ట్ హౌస్ లేక ప్రాజెక్టు సందర్శనకు వచ్చే వీఐపీలు, విధులు నిర్వహించే అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– పెరుమాళ్ల శేఖర్, ఎంపీపీ, కేతేపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



నిధుల కొరత కారణంగా మూసీ ప్రాజెక్టు వద్ద నిర్మించిన అతిథి గృహానికి మరమ్మతులు చేయలేదు. మరమ్మతుల కోసం గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే పనులు చేపట్టే అవకాశముంది.

– చంద్రశేఖర్, మూసీ డీఈఈ

ఎక్సైజ్ పోలీసుల దాడులు



చింతలకుంట తండాలో బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం చింతలకుంట తండాలో ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన జాటోతు సంక్రు ఇంట్లో 4 లీటర్ల సారా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట తిరుమలగిరి ఎస్‌ఐ ప్రసాద్, ఎక్సైజ్ ఎస్‌ఐలు గణేష్, మూర్తి, బాలాజీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

రామన్నపేట ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పోర్లగడ్డ, కడపగండి, డాకుతండా, వాచ్యాతండాల్లోని సారా తయారీ స్థావరాలపై గురువారం రామన్నపేట ఎక్సైజ్ సీఐ నాగలత ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. క్వింటాల్ బెల్లం స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ పల్లవిరెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. సీఐ మాట్లాడుతూ సారా తయారు చేస్తూ మొదటి సారి కేసు, రెండోసారి కేసుతో పాటు రూ.లక్ష జరిమాన విధిస్తామని హెచ్చరించారు. వారి వెంట ఎస్‌ఐలు శంకర్, శోభరాణి, సిబ్బంది తిరుమలేష్, వీరయ్య, రాహుజీ, స్వప్న తదితరులున్నారు.

బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో శ్రీబంగారు మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లు గురువారం ప్రారంభమయ్యాయి. సీహెచ్‌సీ భవనం వెనుక ఉన్న పాత ఆస్పత్రి ప్రాంగణంలో దశాబ్దాల క్రితం బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఇటీవల మంజూరైన 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి పాత ఆస్పత్రి భవనం (మండల వైద్యశాల, జిల్లా ఉపవైద్యాధికారి కార్యాలయం) పూర్తిగా కూల్చివేశారు. ప్రాంగణంలోని పాలియేటివ్ కేర్ యూనిట్, సిబ్బంది క్వార్టర్‌లను సైతం నేలమట్టం చేశారు. ఈ క్రమంలో ప్రాంగణంలో బంగారు మైసమ్మ ఆలయాన్ని యథావిధిగా విడిచిపెట్టారు. త్వరలోనే వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బంగారు మైసమ్మ ఆలయాన్ని మరో చోటుకు తరలించాలని నిర్ణయించారు. ఈమేరకు సంబంధిత సిద్ధాంతులతో చర్చించారు. ఆలయాన్ని నిర్మించే ప్రదేశంలో గురువారం ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ ఆదివారం లేదంటే వచ్చే ఆదివారం ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- 20కి పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా గుర్తింపు
- 9 బైక్‌లు స్వాధీనం



పట్టుబడిన నిందితుడిని చూపుతున్న డీఎస్పీ, సీఐ

కోదాడరూరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో బైక్‌లను చోరీ చేస్తున్న వ్యక్తిని గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని నయానగర్‌కు చెందిన గుండపనేని సందీప్ దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. చోరీ చేసిన సామగ్రి, బైక్‌లను విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవాడు. పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగలించిన 20 పైగా కేసుల్లో జైలు జీవితం కూడా గడిపాడు. గురువారం ఉదయం పట్టణ సీఐ రాము తన సిబ్బందితో కలిసి దుర్గాపురం జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా సందీప్ బైక్‌పై జగ్గయ్యపేట వైపు అనుమానస్పదంగా వెళ్తూ కనిపించాడు. పాత నేరస్తుడనే అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. రెండు నెలల కాలంలో కోదాడ రూరల్, మునగాల, చిలుకూరు ఖమ్మం పట్టణ స్టేషన్, వైరా స్టేషన్‌ల పరిధిలో 9 బైక్‌లను చోరీ చేసినట్లు తెలిపారు. ఈ బైక్‌లను పట్టణ సమీపంలోని అల్వాలపురంలో గల వెంచర్‌లో దాచినట్లు పేర్కొన్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకొని పట్టణ స్టేషన్‌కు తరలించి నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాము, సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడు, బత్తిని నాగేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

నేరాల నియంత్రణకు నిబద్ధతతో పనిచేయాలి

- డీసీపీ రాజేశ్‌చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ, పాల్గొన్న పోలీసు అధికారులు

వలిగొండ : నేరాల నియంత్రణకు పోలీసులు నిబద్ధతతో పని చేయాలని డీసీపీ రాజేశ్‌చంద్ర సూచించారు. గురువారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన చౌటుప్పల్ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గంజాయి రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కుటుంబ తగాదాలకు సంబంధించి కౌన్సిలింగ్ ద్వారా పరివర్తన తీసుకురావడానికి భువనగిరిలో భరోసా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూవివాదాల్లో పరిమితికి లోబడి పని చేయాలని సూచించారు. సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, సీపీలు మోతిరాం మహేష్, దేవేందర్, ఎస్‌ఐలు ప్రభాకర్, దిలీప్, రాఘవేందర్, నాగరాజు, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ వైఎస్ చలవే..

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బీబీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉచిత్ విద్యుత్ విషయంలో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పు పడుతూ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల కోసం ఉచిత విద్యుత్ తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, రూ.60వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనన్నారు. రేవంత్ రెడ్డి మాటలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి, బస్వయ్య, ఆగమయ్య, మనోహర్, ప్రవీణ్, ప్రభాకర్, రాజేశ్వర్, జానీ, నర్సిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఆవుల పాండయ్య (ఫైల్)

నల్లగొండ క్రైం: పట్టణంలోని నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై ఆర్జాల బావి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లగొండ రూరల్ ఎస్సై కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్జాలబావికి చెందిన ఆవుల పాండయ్య(66) బైక్‌పై తన వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. రోడ్డును దాటుతున్న క్రమంలో మిర్యాలగూడెం నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి పాండయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరుగురు జూదరులపై కేసు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు నల్ల గొండ రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద రూ.43,190 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, కుర్చీలు, టేబుల్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. స్థానిక సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని ఓ రిసార్ట్స్‌లో పలువురు పేకాట ఆడుతుండగా గురువారం సాయంత్రం ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇందులో 10 మంది పట్టుబడగా.. వారి నుంచి రూ.13,900 నగదు, 10 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్వోటీ పోలీసులు వీరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని..

- భర్త ఇంటి ఎదుట ఆందోళన

చింతపల్లి: తనను వివాహం చేసుకున్నాడని, కానీ కాపురానికి తీసుకెళ్లడం ఓ యువతి తన భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈ ఘటన గురువారం చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సరిత, చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన నడింపల్లి శ్రీనివాస్ గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం ఇరువురు హైదరాబాద్ వెళ్లి వివాహం చేసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ సరితను కాపురానికి తీసుకెళ్లకుండా దూరంగా ఉంచుతున్నాడు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ సరిత శ్రీనివాస్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న చింతపల్లి ఎస్‌ఐ సతీష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువురి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, అక్కడి నుంచి దేవరకొండ డీఎస్పీ కార్యాలయానికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ తన భార్యను కాపురానికి తీసుకెళ్లాడు.

భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

చివ్వెంల(సూర్యాపేట): భూ వివాదంలో భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులోని సర్వేనంబర్ 309లో 2 ఎకరాల 6 గుంటల స్థలాన్ని 8 మంది కలిసి కొనుగోలు చేశారు. ఈ భూమిలో సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నట్టి సృజన్‌కుమార్‌కు 20 గుంటల భూమి ఉంది. అతనితో పాటు దాని పక్కనే పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వల్లెం శంకర ప్రసాద్‌కు కొంత భూమి ఉంది. ఈక్రమంలో పక్కన భూమి ఉన్న మరో వ్యక్తి గురువారం తన స్థలానికి హద్దురాళ్లు పాతే క్రమంలో సృజన్‌కుమార్, శంకర్ ప్రసాద్‌కు సమాచారం అందించడంతో వారిద్దరూ అక్కడకు వెళ్లారు. ఆ ప్రదేశంలో హద్దురాళ్ల విషయంలో వివాదం చోటుచేసుకుంది. సృజన్ కుమార్‌పై శంకర్ ప్రసాద్, ఆయన స్నేహితుడు పాల సైదులు కలిసి దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాల బారిన పడిన సృజన్ కుమార్ ఈ విషయాన్ని తన భార్య జ్యోతికి తెలుపడంతో ఆమె సంఘటన స్థలానికి చేరకుంది. ఆమెపై కూడా దాడికి పాల్పడటంతో ఇరువురికి గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సృజన్‌కుమార్ ఫిర్యాదు మేరకు శంకర్‌ప్రసాద్, పాలకూరి సైదులుపై ఎస్‌ఐ మధునాయుడు కేసు నమోదు చేశారు.

హుజూర్‌నగర్‌లో వాహనాల తనిఖీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో పోలీసులు గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని, మైనర్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో గరిడేపల్లి ఎస్‌ఐ వెంకటరెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు ఉన్నారు.

స్వీపర్ల వేతనాలు పెంచాలి



సమ్మె చేస్తున్న స్వీపర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు తమ వేతనాలు పెంచాలని 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. గురువారం సూర్యాపేటలో స్వీపర్లు చేపట్టిన సమ్మెకు ఇఫ్టూ, ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనాలను అమలు చేయకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.27 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శంకర్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, పీడీఎస్‌యు పిడమర్తి భరత్, జిల్లా అధ్యక్షులు నార్ల పరశురాములు, ప్రధాన కార్యదర్శి ఎస్కే రసూల్, చిక్కుల వెంకటేశ్వర్లు, జానకి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



జెడ్పీ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న స్వీపర్లు

నల్లగొండ టౌన్ : మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష చేశారు. ఈ దీక్షలో దండెంపల్లి సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వీపర్లు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమానం వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పనస నర్సింహగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, పి.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అనీఫ్, కె.యాదగిరి, పూలమ్మ, ఎం.నాగయ్య, లింగయ్య, ఎం.దేవి, కోటయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం

- డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ఓ వ్యక్తిని లాఠీతో కొట్టడంతో విరిగిన చేతి వేళ్లు
- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుడి బంధువుల ఆందోళన



ధర్నా చేస్తున్న బాధితుడి బంధువులు



బాధితుడు సైదులు

మిర్యాలగూడ అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తిని లాఠీతో కొట్టడంతో అతడి చేతి వేళ్లు విరిగాయి. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన ఎర్ర సైదులు డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామం బాబుసాయిపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన సైదులును ఆపిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధీర్ బైక్ తాళం చెవిని లాక్కున్నాడు. తాను మద్యం తాగానని, బ్రీత్ ఎనలైజర్ ఊదుతానని చెప్పాడు. దీంతో కానిస్టేబుల్ అతడిని తీవ్ర పదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నావని, ఫైన్ కూడా కడతానని, నా బైక్ తాళం చెవిని ఇవ్వాలని సైదులు కోరగా.. కోపోద్రిక్తుడైన కానిస్టేబుల్ లాఠీతో సైదులు చేతిపై తీవ్రంగా కొట్టాడు. పోలీసులు అతడిని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు చేతి వేళ్లు విరిగినట్లు చెప్పారు. సైదులును కానిస్టేబుల్ లాఠీతో కొట్టిన వీడియోలు సోషల్‌మీడియాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ విషయంపై టూ టౌన్ సీఐ నరసింహారావును వివరణ కోరగా మద్యం సేవించి ఉన్న వ్యక్తిని నియంత్రించేందుకు కానిస్టేబుల్ తన విధులు నిర్వహించాడని, కావాలని చేసింది కాదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన..

డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో చేతి వేళ్లు విరిగేలా కొట్టడంతో బాధితుడి బంధువులు, తోటి డ్రైవర్లు గురువారం మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. టూ టౌన్ సీఐ నరసింహారావు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఎర్ర సైదులు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.